# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ నమీబియాలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం “ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్విట్చియా మిరాబిలిస్”ను ప్రదానం చేశారు.

- ❖ ఔషధల వినియోగం కోసం ఒంటె పాలను సేకరించనున్నామని కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు.

- ❖ దేశంలో పత్తి ఉత్పాదకత, నాణ్యతను పెంచడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

- ❖ ఇంధన విద్యను పాఠ్యాంశాలలో అనుసంధానించడం ఎంతో అవసరమని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

=========================

ఐదు దేశాల పర్యటనలో భాగంగా నమీబియాలో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం “ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్విట్చియా మిరాబిలిస్”ను ప్రదానం చేశారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఆయన చేసిన కృషికి గాను ఈ గుర్తింపు లభించింది. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందుకున్న 27వ అవార్డు. ఈ సందర్భంగా నమీబియా ప్రభుత్వానికి, ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం భారతదేశం, నమీబియా మధ్య శాశ్వత స్నేహానికి నిదర్శనమన్నారు. భారత్, నమీబియా దేశాలు వారి వారి స్వాతంత్ర్య పోరాటాల సమయంలో ఒకరికొకరు అండగా నిలిచాయని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

అంతకుముందు నమీబియా రాజధాని విండ్‌హోక్‌లోని స్టేట్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆ దేశ అధ్యక్షులు నెతుంబో నంది-నైత్వా మధ్య జరిగిన చర్చలో పలు కీలక రంగాల అవగాహన ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి.

==========================

ఔషధాల వినియోగం కోసం ఒంటె పాలను సేకరించనున్నామని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా తెలిపారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా ఈరోజు అహ్మదాబాద్ లో గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల సహకార సంఘాల మహిళలతో అమిత్ షా సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాలుగు ఆయుర్వేద సంస్థలు ఒంటె పాలలోని ఔషధ గుణాలను పరీక్షిస్తున్నాయని తెలిపారు. ఒక కంపెనీ ఇప్పటికే ఈ పనిని పూర్తి చేసిందన్నారు. గుజరాత్, రాజస్థాన్ ప్రభుత్వాలు సంయుక్తంగా దేశవ్యాప్తంగా ఒంటె పెంపకందారుల నుండి పాలను సేకరించి, దాని ఔషధ లక్షణాలను ఉపయోగించి అధిక ధరను పొందేందుకు ఒక ప్రణాళికను రూపొందిస్తున్నాయని వివరిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

==========================

దేశంలో పత్తి ఉత్పాదకత, నాణ్యతను పెంచడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని ఈరోజు విడుదల చేశారు. దేశంలో పత్తి ఉత్పాదకత ప్రస్తుతం చాలా తక్కువగా ఉందని, ఇటీవలి కాలంలో, బిటి పత్తిని ప్రభావితం చేసే టిఎస్వి వైరస్ కారణంగా ఉత్పాదకత మరింత తగ్గిందన్నారు. వీటి ఉత్పత్తి పెంచేందుకు వైరస్ దాడులను తట్టుకోగల అధిక-నాణ్యత విత్తనాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పత్తి ఉత్పాదకత సమస్యలను చర్చించేందుకు ఈ నెల 11వ తేదీన కోయంబత్తూరులో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని కేంద్రమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో పత్తి పండించే రైతుల ప్రతినిధులు, రైతు సంస్థలు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు, పత్తి ఉత్పత్తి చేసే రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉత్పాదకత, నాణ్యతకు సంభందించి పలు సలహాలు, సూచనలను టోల్-ఫ్రీ నంబర్: 1800 180 1551 కు తెలియజేయాలని కేంద్రమంత్రి సూచించారు.

విరామం

==========================

సమాజ అవసరాలు తీర్చే ఇంధన విద్యా సామాజిక శ్రేయస్సుకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందిచాల్సిన అవసరం ఉందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీ నిర్వహించిన “భవిష్యత్‌కు సిద్ధంగా ఉన్న ఇంధన విద్య, అవకాశాలు, సవాళ్లు” అనే జాతీయ కార్యశాలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారత్ ప్రపంచంలో 3వ అతిపెద్ద ఇంధన వినియోగదారు అని, తలసరి శక్తి వినియోగంలో కేవలం మూడింట ఒక వంతు మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఇంధన విద్య కోసం IIT-లు చూపిస్తున్న చొరవ ఎంతో ఉపయోగకరం అన్నారు. ఇంధన విద్యను విద్యా పాఠ్యాంశాలతో అనుసంధానించడానికి ఇది పునాది వేస్తుందని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 24 సెకన్లు)

==========================

గుజరాత్‌లోని వడోదర జిల్లాలో వంతెన కూలిపోయిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి పట్ల సంతాపం వ్యక్తం చేసిన ప్రధానమంత్రి వారి కుంటుంబసభ్యులకు ప్రగడసానుభూతి తెలియజేశారు. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుంటుబాలకు ఒక్కొక్కరికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి రెండు లక్షల రూపాయల పరిహారాన్ని నరేంద్రమోదీ ప్రకటించారు. గాయపడిన వారికి 50 వేల రూపాయలు అందజేయనున్నారు.

గుజరాత్‌లోని వడోదర జిల్లా పద్రా వద్ద ఈ రోజు ఉదయం మహిసాగర్ నదిపై ఉన్న గంభీర వంతెనలోని కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో దానిపై వెళ్తున్న రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు సహా పలు వాహనాలు నదిలో పడిపోవడంతో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు.

==========================

ఉక్రెయిన్‌లోని పశ్చిమ భాగాన్ని లక్ష్యంగా చేసుకుని రష్యా దళాలు సుమారు 750 డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరిపాయని ఉక్రెయిన్ తెలిపింది. తమ వైమానిక దళం 711 డ్రోన్లు, ఏడు క్షిపణులను కూల్చి వేసినట్లు పేర్కొంది. పోలాండ్, బెలారస్ సరిహద్దులను కలిగిన పశ్చిమ వోలిన్ ప్రాంతం లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపింది. కీవ్‌కు వైమానిక రక్షణ ఆయుధాల సరఫరాను నిలిపివేయాలన్న ఇటీవలి నిర్ణయంపై అమెరికా తన వైఖరిని మార్చుకుంటుందని ప్రకటించిన నేపథ్యంలో రష్యా దాడులు జరిపిందని పేర్కొంది.

==========================

ఆండర్సన్–టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్ లోని లార్డ్స్ మైదానం వేదికగా 3వ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ రేపు ప్రారంభం కానుంది. భారత్-ఇంగ్లండ్ జట్లు మధ్య ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఇప్పటికే 1-1తో సమంగా ఉండడంతో.. లార్డ్స్‌లో జరిగే టెస్టులో గెలిచి ఆధిక్యం పెంచుకోవాలనే లక్ష్యంతో ఇరు జట్లు తలపడనున్నాయి.

కాగా ఇంగ్లాండ్‌లోని మ్యాంచెస్టర్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ మహిళ టీ 20 సిరీస్ లో భాగంగా 4వ టీ-20 క్రికెట్ మ్యాచ్ ఈరోజు జరగనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 11 గంటలకు ప్రారంభం కానుంది.

==========================

రాబోయే 2 రోజుల్లో మధ్య భారతదేశంలోని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ఉత్తర భారతదేశంలో రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఢిల్లీ పరిసర ప్రాంతంలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

==========================
==========================